సాక్షి
శ్రీకాకుళం

I

గురువారం । 14 । డిసెంబర్ । 2023



ఉద్దానోద్ధారకుడు

- కిడ్నీ ఆస్పత్రి, వైఎస్సార్ సుజలధార ప్రారంభం నేడు
- సీఎం వైఎస్ జగన్ పర్యటనకు సర్వం సిద్ధం
- పలాసలో బహిరంగ సభ

మూడు దశాబ్దాలుగా పాడె మోస్తూ అలసిపోయిన ఉద్దానం కోసం కొత్త ఆస్పత్రి పురుడు పోసుకుంది. అంప శయ్యపై ఉన్న ఉద్దానం ఆయుష్షును పెంచేందుకు వంశధార పరుగుపరుగున వస్తోంది. చెదిరిపోయిన చిరునవ్వులకు, చితికిపోయిన బతుకులకు కిడ్నీ ఆస్పత్రి ఓ కాంతిరేఖలా కనిపిస్తోంది. ఏడుపు వింటూ ఎదిగిన చెట్లకు, కన్నీటితో తడిచిన మట్టికి సుజలధార నీరు పుణ్యతీర్థమై అగుపిస్తోంది. బాధితుల కంట ధార కట్టిన కన్నీరు ఆగే కాలమిది. వారి గుండెలో గూడు కట్టుకున్న శోకం ముగిసే సమయమిది. ఈ నేలత ల్లికి పట్టిన శాపానికి విమోచనమిది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి, ఆయన సమర్థతకు ఈ రెండు ప్రాజెక్టులు నిదర్శనాలు. నిఖార్సైన నాయకత్వానికి మచ్చుతునకలు. – సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

● ఆయుష్షు పెంచే ఆస్పత్రి..



కిడ్నీ పరిశోధన కేంద్రం

వ్యయం: రూ.85 కోట్లు

లక్ష్యం: కిడ్నీ బాధితులకు స్థానికంగా అధునాతన చికిత్స, వ్యాధి మూలాలను కనుగొనేందుకు ఇక్కడే నిరంతర అధ్యయనం

1990ల కాలం నుంచి ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మరణాలు కనిపిస్తున్నాయి. ఇన్ని దశాబ్దాల తర్వాత వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక గానీ ఇక్కడ ఓ పరిశోధన కేంద్రం ఏర్పాటు కాలేదు. 2004లో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నాటి ఇచ్ఛాపురం ఎమ్మెల్యే నరేష్‌కుమార్‌అ గర్వాలా(లల్లూ) చొరవ తీసుకుని కేజీహెచ్ హెచ్‌ఓడీ డాక్టర్ రవిరాజ్ చేత 2005లో కవిటి ప్రాంతంలో పరిశోధనలు చేయించినా.. పూర్తిస్థాయిలో ఆస్పత్రి నిర్మా ణం వైఎస్ జగన్‌తోనే సాధ్యమైంది. 2019లో కిడ్నీ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత కోవిడ్‌తో రెండేళ్లు ప్రపంచమంతా స్తంభించిపో యింది. అయినా ఎక్కడా డీలా పడకుండా ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రా రంభానికి సిద్ధం చేశారు. ఆస్పత్రి నిర్మాణానికి రూ.60 కోట్లు ఖర్చు చేయడం తో పాటు అధునాతన యంత్రాల కోసం మరో రూ.25 కోట్లు వెచ్చించారు. పరిశోధన కేంద్రం స్థాపనకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సహ కారం తీసుకున్నారు. అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

కొత్త ఆస్పత్రి బాగుంది



నేను 2013 నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాను. నాకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. నాకు రూ.పదివేలు పింఛన్ అందుతోంది. పలాసలోని కొత్త ఆస్పత్రిలో చక్కగా డయాలసిస్ అందుతోంది. – పైల మాధవరావు, గంగువాడ, పలాస మండలం

● బిరబిరా వంశధార..



వైఎస్సార్ సుజల ధార

వ్యయం: రూ.742 కోట్లు

లక్ష్యం: కలుషిత భూగర్భ జలాల నుంచి విముక్తి. కిడ్నీ వ్యాధి నిర్మూలనకు 807 గ్రామాల్లో ఇంటింటికీ శుద్ధజలం

ఉద్దానంలో భూగర్భ జలాల కారణం గానే వ్యాధి ప్రబలుతోందని, ఉపరితల జలా లు అందిస్తే ఫలితం ఉంటుందని ఓ అధ్య యనం సూచించడంతో ఎక్కడో హిరమం డలంలోని వంశధార నుంచి ఉద్దానంకు నీరు ఇవ్వడానికి 2019లో వైఎస్ జగన్ భగీరథ ప్రయత్నం మొదలుపెట్టారు. దాదాపు రూ.742 కోట్లతో భారీ రక్షిత మంచినీటి పథ కానికి శ్రీకారం చుట్టారు. దాదాపు వంద కిలో మీటర్ల దూరం నీటిని తీసుకెళ్లే ఈ పథకంలో భాగంగా వంశధార, మహేంద్ర తనయ, బాహుదా నదులను తవ్వి భూగర్భ పైపులైన్ వేశారు. గ్రామాలకు స్వచ్ఛ జలాలను అందించేందుకు 1,047 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేశారు. రోజుకు సగటున 8.40 కోట్ల లీటర్ల నీరు ప్రవహించేలా పైపులైన్లు రూపొందిం చడం విశేషం. హిరమండలం రిజర్వాయర్ వద్ద నిమిషానికి 28 వేల లీటర్ల నీటిని పంపింగ్ చేసే రెండు మోటార్లను ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ నుంచి 32 కిలోమీటర్ల దూరంలోని మెళియాపుట్టి వద్దకు నీరు తరలించి, అక్కడ శుద్ధి చేసి ఉద్దానానికి సురక్షిత జలాలను తరలిస్తారు.

సుజలధారతో సంపూర్ణ ఆరోగ్యం



కిడ్నీ ప్రభావిత గ్రామాల్లోని ప్రతి ఇంటికీ ఉపరితల జలాలు అందించడం సాధారణ విషయం కాదు. దీని వల్ల ప్రస్తుత తరానికి ఉపశమనం లభించడమే కాదు.. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర జీవితం అందుతుంది. – మద్దు వెంకటేశ్వరరావు, బూరగాం, కంచిలి

సాధికార దీపిక


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, వై.వి.సుబ్బారెడ్డి, ధర్మాన కృష్ణదాస్, రెడ్డిశాంతి తదితరులు


ఫ్యాన్ గుర్తుతో జనం ఉత్సాహం

• చూపు లేకున్నా సాధికార యాత్రకు..


మనవడి సాయంతో వచ్చిన వృద్ధుడు

మెళియాపుట్టి/పాతపట్నం/ఎల్.ఎన్.పేట: పాతపట్నంలో బుధవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు కొత్తూరు మండలానికి చెందిన ఓ వృద్ధుడు మనవడి సహకారంతో వచ్చాడు. తనకు చూపులేకపోయినా ప్రజాసాధికార యాత్రలో అధికారులు చెప్పే సంక్షేమం, అభివృద్ధి గురించి వినాలని వచ్చినట్లు తెలిపాడు.


వైఎస్సార్‌సీపీ జెండాలు, కరపత్రాలతో అభిమాని



పాతపట్నం నియోజకవర్గంలో సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభకు హాజరైన జనం, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

స్వరమెత్తిన సాధికారం

జనం గొంతున సాధికార గీతిక ప్రతిధ్వనించింది. యాత్ర దారి పొడవునా సామాజిక చైతన్య పతాక సగర్వంగా ఎగిరింది. బడుగుల అడుగుల చప్పుళ్లతో పాతపట్నం మార్మోగింది. సామాజిక సాధికార యాత్రను నాయకులు ఉత్సాహంగా మొదలుపెడితే ప్రజలు ఉత్సవంలా జరిపించారు. పదునైన విమర్శలు, ఆలోచనాత్మక ప్రసంగాలు, జై జగన్ నినాదాలతో పాతపట్నం సాధికార యాత్ర విజయవంతమైంది.

- పాతపట్నంలో వెల్లివిరిసిన సామాజిక చైతన్యం
- సాధికార యాత్రకు తరలివచ్చిన అశేష జనవాహిని
- నేతల ప్రసంగాలకు అపూర్వ స్పందన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం పాతపట్నం నియోజకవర్గంలో విజయవంతంగా ముగిసింది. తొలుత బూరగాంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ మేలును వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారంలో కల్పించిన ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం బూరగాంలో బస్సుయాత్రను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అదే గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అక్కడ ఉద్యోగులు, రైతులతో మాట్లాడారు. బస్సు యాత్రలో వచ్చిన ప్రజాప్రతినిధులకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. అక్కడి నుంచి అమ్మవారి గుడి, గవర్నమెంట్ హాస్పిటల్, ఆల్ ఆంధ్రా రోడు మీదుగా పాత స్టేట్‌బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన సభ వేదిక వద్దకు చేరింది. గిరిజనులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.


పాతపట్నంలో బస్సుయాత్ర

ఆద్యంతం హర్షాతిరేకాలు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలు ఆసక్తికరంగా సాగాయి. బడుగు, బలహీన వర్గాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన ప్రయోజనాలను కళ్లకు కట్టినట్టు మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి వివరించినప్పుడు హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. చంద్రబాబు హయాంలో జరిగిన మోసం, చేసిన అన్యాయాల కోసం మాట్లాడినప్పుడు చప్పట్లతో ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు ఈ జిల్లాకు ఒక్కటైనా చేశాడా? అని అడిగినప్పుడు లేదు...లేదు అంటూ ప్రజలంతా ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన కాలంలో ఏమీ చేయని చంద్రబాబు ఇప్పుడు అధికారం ఇస్తే ఏదో చేస్తానంటున్నాడు...నమ్ముతారా ? అని అడిగేసరికి నమ్మం నమ్మం అని సైగలు చేశారు.

కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి నియోజకవర్గ సమన్వయ కర్త దువ్వాడ వాణి, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, నర్తు రామారావు, వరుదు కల్యాణి, పెనుమత్స సురేష్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు, లోకేశ్వర రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, బెందాళం విజయలక్ష్మి, తమ్మినేని చిరంజీవి నాగ్, డోల జగన్, చింతాడ మంజు, ఎన్ని ధనుంజయరావు, పిల్లా సుజాత, రాజాన హైమావతి, పాల వసంతరెడ్డి, గురాడి అప్పన్న, బొడ్డేపల్లి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే మెరుగైన జీవనం



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అన్ని వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. గత ప్రభుత్వ పరిపాలన, జగనన్న పాలనలోని తేడాలను ప్రజలు గమనించాలి. చంద్రబాబు రాష్ట్ర విభజనకు ముందు, తర్వాత ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల పాలించినా రాష్ట్రానికి చేసిందేమీ లేదు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు మాత్రమే బాగుపడ్డాయి. జగనన్న పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రజలు ఓటు వేసే ముందు కేవలం నాయకుడినే కాకుండా జీవన ప్రమాణాలు పెంచే పార్టీ, సంక్షేమ పథకాలను ఇచ్చే పార్టీకి ఓటు వేయాలి. పార్టీ నాయకుల వద్దకు పథకాల కోసం వెళ్లాల్సిన పనిలేదు. భూరీసర్వేతో చట్టాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. రైతులకు భూమిపై శాశ్వత హక్కు లభించింది. ఇంతగా గ్రామాల్లో అభివృద్ధి జరుగుతున్నా టీడీపీ నాయకులకు కనిపించడం లేదా?..దేశంలో 29 రాష్ట్రాలు ఉంటే జగనన్న పాలనలో ఆంధ్రప్రదేశ్ ఎంతో అభివృద్ధి సాధించింది. 2014–2019 మధ్య చంద్రబాబు పాలనలో రాష్ట్రం స్థూల జాతీయ ఉత్పత్తిలో 16వ ర్యాంకు, పెరక్యాపిటాలో 17వ ర్యాంకు, వ్యవసాయ గ్రోత్‌లో –6.5లో ఉంటే 2019–23 మధ్య జగనన్న పాలనలో స్థూల జాతీయ ఉత్పత్తిలో 4వ ర్యాంకు, పెరక్యాపిటాలో 9వ ర్యాంకు, వ్యవసాయ గ్రోత్‌లో +5.56లో రాష్ట్రం నిలిచింది. దీనిని ప్రజలు గమనించాలి.

– ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

దేశానికే ఆదర్శం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ పాలన దేశానికి ఆదర్శనీయం. పథకాలు, పనుల కోసం అధికారుల, పార్టీ నాయకుల వద్దకు వెళ్లకుండా నేరుగా సచివాలయం వద్దకు వెళ్లేలా పాలన తీసుకువచ్చారు. జగనన్న అధికారం చేపట్టిన తర్వాత పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం, కాగువాడ–రొమదల గ్రామాలకు వెళ్లేందుకు మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం, మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం.. ఇలా ఎంతో అభివృద్ధి సాధించాం. కరోనా లాంటి కష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కింది.

– రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

ప్రజల వద్దకు పరిపాలన



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రజల వద్దకు పరిపాలన వచ్చింది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ఎరువులు, విత్తనాలు, పథకాలు ఇంటికే అందుతున్నాయి. అభివృద్ధి, లబ్ధిదారులకు వివిధ రూపాల్లో పథకాల పేరుతో ఇచ్చిన ఆర్థిక ప్రయోజనాలను అందరికీ తెలిసేలా సచివాలయాల వద్ద బోర్డులు ప్రదర్శించాం. ఇవి వాస్తవం కాదని ప్రతిపక్షాలు నిరూపించగలవా?. నాయకుల ప్రమేయం లేకుండా పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నాం. కాదని నిరూపిస్తే ఇక్కడే రాజీనామా చేస్తా. అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యాదీవెన, ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలు దేశంలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. అన్ని కులాలకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కింది. ఎన్నో దశాబ్దాలుగా ఉద్దాన ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న కిడ్నీ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు కిడ్నీ పరిశోధన కేంద్రం, వంశధార నది నుంచి ఉద్దానం ప్రాంతానికి తాగునీరు అందిస్తున్న ఘనత జగనన్నదే.

– తమ్మినేని సీతారాం, అసెంబ్లీ స్పీకర్

గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం



వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగనన్న గిరిజన సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యమిచ్చారు. 1.53 లక్షల మంది గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడంతో పాటు బ్యాంకుల ద్వారా పోడుభూములకు రుణాలు ఇప్పించారు. పోడు సాగుచేసే రైతులకు రైతు భరోసా వర్తింపచేశారు. ఎస్టీ కమిషన్, గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయటంతో పాటు మంత్రి మండలిలో గిరిజన ఎమ్మెల్యేలకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

చంద్రబాబు, పవన్‌లను నమ్మరు..



చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. ఈ ముగ్గురు నాయకులు ప్రజలకు ఏం చేశారో చెప్పాలి. అధికార దాహంతో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. వీరిని నమ్మితే మోసపోవడం ఖాయం. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమం అన్ని రంగాల్లోనూ ఎంతో అభివృద్ధి చెందాం.

– కంబాల జోగులు, రాజాం ఎమ్మెల్యే

– పాతపట్నం, ఎల్.ఎన్.పేట, కొత్తూరు, మెళియాపుట్టి, హిరమండలం

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

• ముస్తాబైన సభా ప్రాంగణం


వేదిక ముందు ఏర్పాటు చేసిన కుర్చీలు


సిద్ధమైన సభావేదిక

కాశీబుగ్గ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కిడ్నీ పరిశోధన కేంద్రం, వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు ప్రారంభం అనంతరం పలాస రైల్వే క్రీడా మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వర్షం పడినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేలాది మంది సభ వీక్షించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల రాకపోకలకు ప్రత్యేక మార్గాలతో పాటు వినతుల స్వీకరణ, ఆరోగ్య శిబిరం, మంచినీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు వంటి సౌకర్యాలతో పాటు 108 అంబులెన్సు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచుతున్నారు. సభావేదికపైనే పలాసకు నూతన పారిశ్రామికవాడ శంకుస్థాపన నిర్వహించనున్నారు.

60 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్

- నేడు సీఎం చేతులమీదుగా శంకుస్థాపన

కాశీబుగ్గ: పలాస మండలం రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో నూతన పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 60 ఎకరాల్లో ఇక్కడ పరిశ్రమలకు అవకాశం ఉంది. ఈ కారిడార్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే ఇదే మున్సిపాలిటీలోని అనంతపురం రెవెన్యూ పరిధిలో 31ఎకరాల్లో 112 జీడి పరిశ్రమలు నడుస్తున్నాయి. ఇప్పుడు మరో పారిశ్రామిక వాడ ఏర్పాటు కానుంది. రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో 148వ సర్వే నంబర్‌లో ఐదు విభాగాల్లో స్థలాలను కేటాయించారు. దీనిపై ఏపీఐఐసీ ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ జోనల్ మేనేజర్ బడగల హరిధరరావు మాట్లాడుతూ నూతన పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రోడ్లు, కాలువలు, విద్యుదీకరణ కోసం ప్రభుత్వం రూ.12.60 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఔత్సాహికులకు అర ఎకరా చొప్పున కేటాయిస్తామన్నారు.


పలాస మండలం రామకృష్ణాపురం 148వ సర్వే నంబర్‌లో కేటాయించిన 60 ఎకరాల స్థలం

మాటకు కట్టుబడే వ్యక్తి సీఎం వైఎస్ జగన్

- ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: హామీ ఇచ్చి మర్చిపోయే నాయకులు ఉన్న ఈ రోజుల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నేతగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచిపోతారని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన బుధవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్షంలో ఉండగా పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, అధికారంలోకి వచ్చాక వాటిని తీరుస్తున్నారని అన్నారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్, వైఎస్సార్ సుజలధార అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. శంకుస్థాపన చేసి ప్రారంభోత్సవం కూడా నిర్వహించడం జగన్ పరిపాలన దక్షత అని తెలిపారు. అలాంటి నాయకుడిని కలకాలం సీఎంగా గెలిపించాలని కోరారు.

నేడు డాక్టర్ వైఎస్సార్ బాయ్స్ హాస్టల్ ప్రారంభం



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్మించిన బాయ్స్ హాస్టల్ భవనాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. రూ.17.50 కోట్లతో అధునాతన వసతులతో ఈ భవనం నిర్మించినట్లు తెలిపారు. వసతి గృహం నిర్మాణంతో పూర్తిస్థాయిలో బాలురుకు వసతి సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. అధికారులు సూచనల మేరకు శిలాఫలకం సిద్ధం చేశామని చెప్పారు.

ఆర్టీసీ కండక్టర్‌పై దాడి

మందస: మండలంలోని హరిపురం వద్ద పలాస డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కండక్టర్ జి.బాబూరావుపై దాడి జరిగింది. మందస పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం నైట్ అవుట్ డ్యూటీకి బాబూరావు వెళ్తుండగా.. శ్రీచైతన్య కళాశాల వద్ద కొందరు విద్యార్థులు బస్సు ఎక్కారు. డోర్ వద్ద నిలుచోవద్దని, లోపలికి రమ్మని కండక్టర్ చెప్పారు. ప్రయాణికులు బస్సు నుంచి హరిపురంలో దిగుతుండగా విద్యార్థి తండ్రి శ్రీరాములు కండక్టర్‌పై దాడి చేశాడు. బాధిత కండక్టర్ డిపో మేనేజర్, యూనియన్ నాయకులకు తెలియజేయడంతో అందరు కలిసి మందస పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థులపై కోతుల దాడి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని పంజావీధి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందిపై కోతులు దాడిచేశాయి. బుధవారం తరగతులు నిర్వహిస్తున్న సమయంలో సుమారు 50 కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో నాలుగో తరగతి విద్యార్థి చాట్ల తేజ తీవ్రంగా గాయపడటంతో సీహెచ్‌సికి తీసుకెళ్లి వైద్యం అందించారు. కోతులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని, తగు చర్యలు తీసుకోవాలని హెచ్ఎం ధనలక్ష్మి మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్‌కు ఫిర్యాదుచేశారు.

విద్యార్థి విభాగం కమిటీ నియామకం

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యార్థి విభాగ కమిటీని బుధవారం ప్రకటించారు. దీనిలో భాగంగా శ్రీకాకుళంకు చెందిన బద్దాది పానికుమార్‌ను జోనల్ ఇన్‌చార్జిగా, పాగోటి సింహాచలంను జనరల్ సెక్రటరీగా, కొండల బాలకృష్ణను కార్యదర్శిగా, పీఆర్ భరద్వాజ్‌ను జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. వీరి నియామకంపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఉద్దాన ప్రాంతంలోని కిడ్నీ బాధితుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా నిర్మించిన తాగునీటి ప్రాజెక్ట్, 200 పడకల మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ – కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చారని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ వంటి నాయకుల మాదిరిగా కల్లబొల్లి మాటలు చెప్పడం కాకుండా, పేదల కష్టాలు, బాధలు తెలుసుకొని శాశ్వత పరిష్కారానికి పాటుపడే మనసున్న నాయకుడు సీఎం జగన్ అని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ గతంలో ఉద్దానం ప్రాంతానికి వచ్చి మొసలికన్నీరు కార్చి నాలుగు సినిమా డైలాగులు చెప్పి వెళ్లిపోయారు తప్ప బాధితులకు మేలు చేసే కార్యక్రమం ఏదీ చేయలేదన్నారు. దశాబ్దాలుగా ఏ నాయకుడూ ఉద్దాన ప్రాంత వాసులకు జగనన్న చేసినంత మేలు చేయలేదన్నారు. ఈ విషయంలో జిల్లా వాసులు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారని చెప్పారు.